పోలీస్ రాజ్యం నడుస్తోంది

- అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు
- మాజీ ఎమ్మెల్యే కాసుపై అక్రమ కేసు ముమ్మాటికి కుట్రే
- వైఎస్సార్‌సీపీ నేతల ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దాచేపల్లి: కూటమి ప్రభుత్వంలో పోలీసు రాజ్యం తప్ప ప్రజాస్వామ్యం లేదని, పోలీసులను అడ్డు పెట్టుకొని వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని ఆ పార్టీ నేతలు ధ్వజమెత్తారు. నారాయణపురంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కాసు మహేష్ రెడ్డిపై అక్రమ కేసు నమోదును ఖండించారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై కేసు బనాయించేందుకు పోలీసులను అడ్డుపెట్టుకుని టీడీపీ నేతలు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ అమలుపై తాము ప్రశ్నిస్తే మాపై అక్రమ కేసులు పెట్టేందుకు టీడీపీ నేతలు పూనుకోవడం దుర్మార్గమన్నారు. అభివృద్ధిలో పోటీ పడలేని కూటమి నేతలు తమపై అక్రమ కేసులు బనాయించేందుకు కుట్రలు చేయటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడడమని విమర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరిపై కూడా అక్రమంగా కేసులు బనాయించలేదని, ప్రస్తుత శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు తమ పార్టీ కార్యకర్తలు, నాయకులను తీవ్రంగా దుర్భాషలాడినప్పటికీ పోలీసులకు ఫిర్యాదులు చేయలేదని గుర్తు చేశారు. నియోజకవర్గ అధికార ప్రతినిధి షేక్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి మరిచి, ప్రజల నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకతను దృష్టి మళ్లించేందుకే వైఎస్సార్ సీపీపై అక్రమ కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణ మాట్లాడుతూ తమ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తే న్యాయపోరాటం చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభాని, ఎంపీపీ కందుల జాను, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్ సత్తార్, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు కొమరబత్తిన విజయ్ కుమార్, షేక్ ఖాదర్ బాషా,నాయకులు జక్కా అశోక్, కుందూరు తిరుపతిరెడ్డి, షేక్ దాడీ కోలా జంపాల రెడ్డి, ముడి విక్టర్ పాల్, సైదులు జంగాల సింగరయ్య యాదవ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో చిచ్చు పెట్టేది కూటమి నాయకులే..

- మాజీ ఎమ్మెల్యే కాసుపై కేసులు పెట్టడం అన్యాయం
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి యెనుముల



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి యెనుముల

గురజాల: మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై కేసులు పెట్టడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, పల్నాడు జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సిద్దాడపు గాంధీ, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు వీరంరెడ్డి అమరారెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల్లో చిచ్చు పెట్టి వైఎస్సార్ సీపీ మద్దతు దారులపై దాడులు చేసి గ్రామాల్లో లేకుండా చేసింది కూటమి నాయకులే అని ఆరోపించారు. నియోజకవర్గంలోని దాచేపల్లి, మాచవరం, గురజాల, పిడుగురాళ్ల మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులను రాళ్లతో రాడ్లతో కొట్టి వారిపైనే కేసులు బనాయించింది మీరు కాదా అని ప్రశ్నించారు. గ్రామాల్లో లేనిపోని గొడవలు పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నది కూటమి ప్రభుత్వ నాయకులేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కోసం రైతులు, తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారి కష్టాలు తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలే కానీ ఈ విధంగా అక్రమ కేసులు పెట్టి ప్రజల దృష్టి మరల్చాలని చూడడం సిగ్గుగా ఉందని చెప్పారు. ఇప్పటికైనా కూటమి నాయకులు మారి ప్రజల సమస్యలు పరిష్కరించే విధంగా చూడాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వంలో పెద్దలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడారని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి రెచ్చగొట్టే విదంగా మాట్లాడలేదని ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఎప్పుడు ప్రశాంతతకు ప్రాధాన్యతనిస్తారని ఎప్పుడు రెచ్చగొట్టే విధంగా ఆదేశాలు జారీ చేయడన్నారు. పేద ప్రజలకు ప్రతి ఒక్కరికి కార్పొరేట్ వైద్యం అందించాలనే ఆలోచనతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ కళాశాలలు మంజూరు చేసి సిద్ధం చేస్తే వాటిని ప్రైవేటీకరణ చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణలు సిద్ధమయ్యారన్నారు. సమావేశంలో కౌన్సిలర్ పోలు వీరారెడ్డి, మండల కన్వీనర్ కొమ్మినేని బుజ్జి, నాయకులు వేముల చలమయ్య, మన్నెం ప్రసాదరావు, వంకాయలపాటి మల్లయ్య, జక్కా సత్యనారాయణ తదితరులున్నారు.

క్లుప్తంగా

బాలకృష్ణారెడ్డి మృతి తీరని లోటు



గురజాల రూరల్: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బాలకృష్ణారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అంబాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బాలకృష్ణారెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాలకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు రాష్ట్ర కార్యదర్శి యెనుముల మురళీధర్ రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యుడు ఆరికట్ల శ్రీనివాసరెడ్డి, మండల యూత్ రాజశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వెంకటేశ్వరుని కల్యాణం



మాచర్ల: పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం శ్రావణ నక్షత్రం స్వామివారి జన్మదినోత్సవం కల్యాణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో మూలవిరాట్‌లను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలిశెట్టిపిచ్చయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కళ్యాణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆచార్యులు అడిగొప్పల చెన్నకేశవచార్యులు, ఆలయ కమిటీ బండ్ల వెంకటేశ్వర్లు, బి.రామిరెడ్డి, రమణారెడ్డి, నర్సయ్య, నట్టూరాధ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది.

కరుణాతరంగం పునీత మదర్‌థెరిస్సా



రెంటచింతల: పేదలకు, కుష్ఠురోగులకు, అనాథలకు కరుణాతరంగంలా మదర్‌థెరిస్సా చేసిన సేవలు, వారిపట్ల ఆమె చూపిన కరుణ, ప్రేమ, దయతో ప్రపంచ ప్రజలతో మాతృమూర్తిగా కొనియాడబడిన మదర్‌థెరిస్సాను వాటికన్‌సిటీ సెయింట్‌హుడ్(పునీతురాలి)గా గుర్తించినట్లు కానుకమాత చర్చి విచారణ సహాయ గురువులు రె.ఫాదర్ ప్రసన్నకుమార్ అన్నారు. శుక్రవారం పునీత మదర్‌థెరిస్సా వర్ధతి నిర్వహించారు. కార్యక్రమంలో మండల మదర్‌థెరిస్సా సేవా సమితి సభ్యులు తుమ్మా అంతోన్‌రెడ్డి, దుగ్గింపూడి శౌరి రాయపరెడ్డి, గాదె బాలశౌరెడ్డి పాల్గొన్నారు.

పట్టణంలో పారిశుద్ధ్య పనులు

మాచర్ల: వర్షాల నేపథ్యంలో పట్టణంలో దోమలు నివారణకు చర్యలు చేపట్టారు. పురపాలక సంఘ కమిషనర్ డి.వేణుబాబు సిబ్బందితో డ్రెయినేజీల్లో పూడిక తీత, ఫాగింగ్ చేయించారు. పట్టణంలో ఎక్కడ ఎలాంటి చెత్త చెదారం లేకుండా తగిన చర్యలు చేపట్టారు. తొట్టెల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఫ్రై డేను డ్రైడేగా పాటించాలన్నారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు.

పలు రైళ్లకు పిడుగురాళ్లలో స్టాప్ కేటాయింపు

పిడుగురాళ్ల: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లకు స్టాప్‌ను కేటాయిస్తూ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు పిడుగురాళ్ల రైల్వే ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు జూలకంటి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. నర్సాపురం– లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ రాత్రి 12.20 వస్తుందని, లింగపల్లి, నర్సాపురం ఎక్స్‌ప్రెస్ రాత్రి 12.40 గంటలకు వస్తుందని, హైదరాబాద్ కాచిగూడ రేపల్లె ఎక్స్‌ప్రెస్ రాత్రి 2.10 గంటలకు వస్తుందని, రేపల్లె వికారాబాద్ జంక్షన్‌కు వెళ్లే రైలు రాత్రి 2.20 వస్తుందని ప్రయాణికులు గమనించాలని చెప్పారు.

రేపు అమ్మవారి ఆలయం మూసివేత

దుర్గి: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయాన్ని గ్రహణం కారణంగా ఆదివారం మూసివేయనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి శుక్రవారం తెలిపారు. 2గంటల నుంచి మూతవేయనున్నటుచెప్పారు. గ్రహణం అనంతరం సోమవారం ఉదయం ఐదు గంటలకు సంప్రోక్షణ చేసిన తరువాత భక్తులకు అమ్మవారి దర్శనం లభిస్తుందని పేర్కొన్నారు.

సబ్ డివిజన్‌లో సజావుగా యూరియా పంపిణీ

ఏడీఏ బత్తుల శ్రీ కృష్ణదేవరాయలు



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల సబ్ డివిజన్ పరిధిలో యూరియా పంపిణీ సజావుగా సాగుతుందని ఏడీఏ బత్తుల శ్రీ కృష్ణదేవరాయలు అన్నారు. పట్టణంలోని ఏడీఏ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఇప్పటి వరకు పంపిణీ చేసినవి మండలాల వారిగా పిడుగురాళ్ల మండలంలో 1362.99 మెట్రిక్ టన్నులు, మాచవరం మండలంలో 224.83 మెట్రిక్ టన్నులు, దాచేపల్లి మండలంలో 252.81 మెట్రిక్ టన్నులు, కారంపూడి మండలం పరిధిలో 310.03 మెట్రిక్ టన్నులు, నకరికల్లు మండలంలో 1039.02 మెట్రిక్ టన్నులు పంపిణీ చేయటం జరిగిందన్నారు. అదే విధంగా ప్రస్తుతం యూరియా నిల్వలు పిడుగురాళ్ల మండలంలో 40.43 మెట్రిక్ టన్నులు, మాచవరం మండలంలో 3.30 మెట్రిక్ టన్నులు, దాచేపల్లి మండలంలో 25.38 మెట్రిక్ టన్నులు, కారెంపూడి మండలంలో 51.36 మెట్రిక్ టన్నులు, నకరికల్లు మండలంలో 181.32 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతు సేవా కేంద్రాలు, కోపరేటీవ్ మార్కెటింగ్ సొసైటీలు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా పంటల దశను బట్టి అవసరమైన మేరకు యూరియా సరఫరా జరుగుతుందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం



గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

మాచర్ల: పట్టణంలో భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం వేడుకగా నిర్వహించారు. చంద్రగ్రహణానికి ముందుగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా, శుక్రవారం ఎక్కువ సంఖ్యలో వినాయక నిమజ్జన కార్యక్రమం వైభవంగా జరిపారు.

డివిజన్ ఆఫీసు తరలిస్తే ఉద్యమిస్తాం

- హెచ్చరించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- స్థానిక ఎమ్మెల్యే కూడా దృష్టిపెట్టాలని విజ్ఞప్తి

నరసరావుపేట: స్థానిక విద్యుత్ సబ్ డివిజన్ ఆఫీసును చిలకలూరిపేటకు తరలిస్తే వైఎస్సార్‌సీపీ తరఫున ధర్నా చేస్తామని, అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక శాసనసభ్యులు విద్యుత్ సబ్‌డివిజన్‌ను చిలకలూరిపేటకు తరలించడానికి తక్షణమే అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రభుత్వం గత 30 ఏళ్ల నుంచి నరసరావుపేటలో ఉన్న విద్యుత్ సబ్ డివిజన్ ఆఫీసును చిలకలూరిపేటకు తరలించాలని తీవ్రంగా ప్రయత్నిస్తుందని, ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారని, కూటమి ప్రభుత్వం ఈనెల 12న నిర్ణయం తీసుకోనున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో విద్యుత్ జిల్లా, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఆఫీస్, కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు ఉన్నాయని, ఇక్కడి నుంచి సబ్‌డివిజన్ ఆఫీసును తీసుకెళ్లి చిలకలూరిపేటలో పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సబ్ డివిజన్‌లో భౌగోళికంగా దూరంగా ఉన్న రొంపిచర్ల, నకరికల్లు, ఈపూరు, శావల్యాపురం మండలాలు కలపటానికి ప్రయత్నం చేస్తున్నారని, ఈపూరు మండలం వాళ్లు నరసరావుపేట వచ్చి ఇక్కడి నుంచి చిలుకలూరిపేట వెళ్లి విద్యుత్ సమస్యలు చెప్పుకోవాల్సిన గత్యంతరం ఏర్పడుతుందన్నారు. నరసరావుపేట రూరల్ మండలం, నరసరావుపేట టౌన్ ఇక్కడే ఉంటాయని, రొంపిచర్ల మండలం మాత్రం చిలకలూరిపేట సబ్‌డివిజన్‌లో కలుపుతున్నారని అన్నారు. దీనికి వినుకొండ శాసనసభ్యులు ఇప్పటికే అభ్యంతరం వ్యక్తంచేశారని, కానీ స్థానిక శాసనసభ్యులు కూడా ఈ ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. చిలకలూరిపేటకు అవసరమైతే ఆ ఏరియాకి సంబంధించి మండలాలు కలుపుకొని ఏర్పాటు చేసుకోవాలని, కానీ ఇక్కడి ఆఫీసు ఇక్కడే ఉంచాలని కోరారు. పార్టీ జిల్లా రైతు విభాగ అధ్యక్షులు అన్నెం పున్నారెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు గుజర్లపూడి ఆకాష్ కుమార్ పాల్గొన్నారు.

చిరుమామిళ్లకు మరో కలికితురాయి

- 30 పడకల ఆస్పత్రికి నిధులు మంజూరు
- రూ.4.5 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- విరాళంగా మరో రూ.5 కోట్లు అందించిన నడికట్టు రామిరెడ్డి



చిరుమామిళ్లలో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ నిర్మాణానికి రామిరెడ్డితో చర్చిస్తున్న ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ నాయక్

నాదెండ్ల: చిరుమామిళ్ళ అభివృద్ధిలో మరో కలికితురాయి చేరనుంది. గ్రామంలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి ప్రభుత్వం నుండి నిధులు మంజూరయ్యాయి. ఆసుపత్రి నిర్మాణానికి గ్రామానికి చెందిన విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి మూడెకరాల భూమిని విరాళంగా అందించారు. వైద్య ఆరోగ్య శాఖ ఈఈ నాయక్, డీఈ, ఏఈలు శుక్రవారం భూమిని పరిశీలించారు. దాత నడికట్టు రామిరెడ్డితో మాట్లాడారు. ఆసుపత్రి నిర్మించేందుకు ప్రభుత్వం రూ.4.50 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచి ఖరారు చేసింది. దాత నడికట్టు రామిరెడ్డి తన స్వంత నిధులు రూ.5 కోట్లు అందించనున్నారు. దీంతో రూ.9.50 కోట్లతో ఆసుపత్రి ఏర్పాటు కానుంది. ఈ ఆసుపత్రిలో సాధారణ వైద్య సేవలతో పాటూ ప్రసూతి, అత్యవసర వైద్య విభాగాలు ఏర్పాటు కానున్నాయి. 25 మంది వైద్యారోగ్య సిబ్బంది సేవలందించనున్నారు. ఈ ఆసుపత్రిని చిరుమామిళ్ళతో పాటూ చుట్టుప్రక్కల గ్రామస్తులు వినియోగించుకోనున్నారు. మూడెకరాల భూమి, రూ.5 కోట్లు విరాళం అందించనున్న రామిరెడ్డి పేరును ఆసుపత్రికి ఖరారు చేయనున్నారు. ఈ ఏడాది అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. వచ్చే ఏడాది దసరా కల్లా నిర్మాణం పూర్తి చేసి సేవలందించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఆదర్శ గ్రామంగా చిరుమామిళ్ల

రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా చిరుమామిళ్ల నిలుస్తున్నది. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ప్రతి వీధికి సీసీ రోడ్లు, సైడు కాలువలు, వీధి లైట్లు, ప్రతి ఇంటికీ నీటి కుళాయి, కార్పొరేట్ స్థాయిని మరిపించేలా ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ పాఠశాల ఉన్నాయి. హైదరాబాద్‌లో స్థిరపడిన నడికట్టు రామిరెడ్డి తన స్వగ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు విశేషంగా కృషి చేశారు. తన స్వంత నిధులు వెచ్చించి గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. తాజాగా రూ.50 లక్షల పూర్తి సొంత నిధులతో ఒలింపిక్ స్థాయి సింథటిక్ రన్నింగ్ ట్రాక్ నిర్మిస్తున్నారు.

వృద్ధ దంపతులకు చేయూత

నూజెండ్ల: మండలంలోని అప్పాపురం గ్రామం ఎస్సీ కాలనీలో తూమాటి నాగయ్య–పున్నమ్మ 70 సంవత్సరాల కల్గియున్న దంపతులు జీవనోపాధి చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం అరుంధతీ సేవా ఫౌండేషన్ సారధ్యంలో 50 కేజీలు బియ్యం నిత్యావసర వస్తువులు, కూరగాయలు పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి కోటేశ్వరరావు తెలిపారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన వారిని అభినందిస్తున్న ఎంఈఓ అల్లి సురేష్



ఫాతిమా స్కూల్‌లో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

మాచర్ల రూరల్: వెనుకబడిన మాచర్ల ప్రాంతం నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఆరుగురు ఎంపిక కావటం ఈ ప్రాంతానికే ఎంతో గర్వకారణమని మండల విద్యాశాఖాధికారి అల్లి సురేష్ కొనియాడారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ శుక్రవారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులందుకున్న వారిని అభినందించారు. ఆర్థికంగా వెనుకబాటుతనమే కానీ, విద్యలో ఏ మాత్రం తగ్గేది లేదని, ఇటీవల నిర్వహించిన 10వ తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయి మొదటి, రెండు ర్యాంకులను సాధించిన మన పాఠశాలల ప్రతిభను తెలియజేసిన ఘనత మన ఉపాధ్యాయులదేనన్నారు. అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయని, విద్యాభివృద్ధిలో, ఇదే రీతిలో ఉత్తీర్ణత సాధించేలా సమష్టిగా పనిచేద్దామని కోరారు. ఈ సందర్భంగా అవార్డులందుకున్న కంభంపాడు హెచ్‌ఎం విజయకుమారి, ఎంపీపీ తాళ్లపల్లి బీసీహెచ్ మోజెస్, జెడ్పీహెచ్ బాలికోన్నత పాఠశాల నుంచి ఎ.కృష్ణారెడ్డి, ఎం.సుధారాణి, ఎత్తిపోతల గవర్నమెంట్ స్కూల్‌కు చెందిన ఎం.సుజాత, ఎంపీపీ స్కూల్ ఎస్‌జీ కాలనీ నుంచి ఎన్.సుధారాణిలను పూలమాలలు, బొకెలతో అభినందించారు.

విద్యార్థి విజయాలే గురువులకు గురుదక్షిణ

రెంటచింతల: ఓ విద్యార్థి సాధించిన విజయాలే తన గురుదక్షిణగా ప్రతి గురువు భావిస్తారని స్థానిక ఫాతిమా స్కూల్ విశ్రాంతి హెచ్‌ఎం వై.విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక ఫాతిమా స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, మదర్‌థెరిస్సా చిత్రపటలకు స్కూల్ కరస్పాండెంట్ ఏరువ ప్రతాప్‌రెడ్డి, హెచ్‌ఎం ఏరువ స్టెఫీస్టార్, డాక్టర్ ఎంబీ చిన్నమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక శ్రీ రామకృష్ణగురుకుల పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఏలూరి శశికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని స్కూల్ కరస్పాండెంట్ ఆత్మకూరి నాగేశ్వరరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావులతో కలిసి సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాలలో ఫాతిమా స్కూల్ డైరెక్టర్ ఏరువ మర్రెడ్డి, గుంటూరు, రెంటచింతల శ్రీ వాసవి అమ్మవారి దేవస్థానం చైర్మన్లు కె.వెంకట నర్సింహారావు, కట్టమూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కేఎస్ఆర్ విద్యా సంస్థల్లో గురుపూజోత్సవం

పిడుగురాళ్ల: పట్టణ శివారులోని కొండమోడు సమీపంలోని కేఎస్ఆర్ విద్యా సంస్థలలో శుక్రవారం గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత భారత రత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు కోనేటి నరసింహారావు, బాడిస మస్తాన్ మాట్లాడతూ... సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయ వృత్తి నుండి భారత రాష్ట్రపత్తిగా దేశంకి ఎంతో సేవ చేసినారని వారు అన్నారు. ఎంతో ఉపాధ్యాయులకు ఆయన ఆదర్శంగా నిలిచారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సాధినేని నరసింహారావు, సురేష్, చిన్నబోయిన శ్రీనివాసరావు, వీరాంజనేయులు, సోమశేఖర్, గోపికృష్ణ, యాకోబు, రాజ, కోనేటి ప్రసన్న, ఎస్‌కే రజియా, డి.ఇందు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సత్కారం

మాచర్ల: ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ మదార్ సాహెబ్, మెట్టు గోవిందరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ ను ప్రత్యేకంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. భావిభారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

స్కాలర్స్ స్కూల్‌లో గురుపూజోత్సవం

పిడుగురాళ్ల: పట్టణంలోని స్కాలర్స్ స్కూల్ ఆవరణలో శుక్రవారం గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్లు జి. శ్రీనివాస్‌రెడ్డి, ఎం. జగదీష్‌రెడ్డిలు మాట్లాడుతూ... డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవాన్ని మనం గురుపూజోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. గురువుల యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ తల్లిదండ్రుల తర్వాత గురువే ప్రధాన దైవంగా భావించాలని, పూజించాలని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీ రామకృష్ణ గురుకుల పాఠశాల టీచర్స్‌డే వేడుకలలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు శశికుమార్



రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కేఎస్ఆర్ విద్యా సంస్థల డైరెక్టర్లు నరసింహారావు, మస్తాన్



స్కాలర్స్ స్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వేణుగోపాల్

సత్తెనపల్లి: స్త్రీ శక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగాలు ఇచ్చి ఆటో డ్రైవర్లకు జీవనోపాధిని కల్పించాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సత్తెనపల్లి ఏరియా సమితి గౌరవ అధ్యక్షుడు నరిశెటి వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని అమరావతి ఆటో పాయింట్‌లో శుక్రవారం ఆటో యూనియన్ కరపత్రాలు ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీలో కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్ పోస్టులు రవాణా శాఖ, ఆర్ అండ్ బీ, మున్సిపల్ ఆఫీసుల్లో అటెండర్స్, ఆఫీస్ బాయ్స్ గానూ, పోలీస్ హోంగార్డు ఉద్యోగాలు ఇచ్చి డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. డ్రైవర్ల హక్కుల సాధనకు పోరాటాలు చేసి ప్రభుత్వాల కళ్లు తెరిపించాలన్నారు. డ్రైవర్ల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు షేక్ మహబూబ్, డి.బాబు, ఏ.రమేష్, చిలక జిప్సను, శీను, మేకా కోటేశ్వరరావు, చెన్నారావు, కిరణ్, రామయ్య, జాను, శంకర్, కె.శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దాచేపల్లి: విద్యుత్ ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ అధికారులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరిచాలని కోరారు.

మాచవరం మండలంలో...

మాచవరం: మాచవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఇన్‌చార్జి ఏఈ భగవాన్ నాయక్, ఎల్ఐ విజయ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం మూడు వరకు సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు. మాచవరం, గంగిరెడ్డిపాలెం, గాంధీనగరం గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిర్వాసిత కేంద్రంలో ఫ్రైడే-డ్రైడే

రాజుపాలెం: మండల కేంద్రంలోని పులిచింతల నిర్వాసిత కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది జ్వరాల సర్వే చేశారు. మురుగు కాలువల్లో ఎబెట్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. నీటితొట్టెలు, కొబ్బరి బొండాలలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు.

మానసిక దివ్యాంగులకు చేయూతనివ్వాలి



సత్తెనపల్లి: పుట్టుకతోనే మానసిక దివ్యాంగులుగా జన్మించిన చిన్నారులకు ప్రతి ఒక్కరూ చేయూతను అందించాలని వట్టిచెరుకూరు ఎంపీపీ చిలకా సుబ్బారావు అన్నారు. పట్టణంలోని పరివర్తన చెవిటి, మూగ, మానసిక దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం ఆయన జన్మదిన వేడుకలు పట్టణానికి చెందిన చిలకా రమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ హనోక్ కేక్ కట్ చేసి అన్నసంతర్పణను ప్రారంభించారు. సుబ్బారావు మాట్లాడుతూ.. తన పేరు మీద దివ్యాంగులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేసిన రమణయ్యను అభినందించారు. కార్యక్రమంలో మదర్ థెరిస్సా సేవా సంస్థ అధ్యక్షుడు చిలుకా జాన్సన్, పరివర్తన నిర్వాకుడు కె.కిషోర్, నాయకులు ఎం.ఈశ్వర్, బందారు రవి, మాబు, పెద్దింటి నాగేశ్వరరావు, రామారావు, దీపాల పరంధామయ్య, ప్రకాష్‌రావు, పచ్చల ఆనంద్, డాక్టర్ రాయపూడి వెంకటేశ్వరరావు, చిలక ఏసుబాబు, పందిటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.